ప్రజాశక్తి
మంగళవారం 9 మే 2023 5 అనంతపురం





అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

వీడని అకాల వర్షాలు..!

◆ మండువేసవిలో వానలు ◆ పంటలపై తీవ్ర ప్రభావం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జల్లా అంటేనే కరువుకు నిలయం. వర్షం కోసం వాన కాలంలోనే ఆకాశం వైపు ఎదురు చూడాల్సిన పరిస్థితులు. అయితే ఈ ఏడాది వర్షాలు మండువేసవిలోనూ పడుతుండటం గమనార్హం. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం రాయలసీమలో వర్షాలు అదికంగా పడుతాయని వాతావరణ చెబుతోంది. ఇప్పటికి ఈ ఏడాది వరుసగా వర్షాలు వేసవిలోనూ పడుతూనే ఉన్నాయి. ఇప్పుడు తాజాగా మే నెలలో అది కూడా వైశాఖ మాసంలో అత్యధికంగా ఎండలుండే సమయం. ఇప్పుడు కూడా వర్షాలు వీడటం లేదు. ఈ ప్రభావం పంటలపైనా తీవ్రంగానే ఉంటోంది.

54.7 శాతం అధికం

సాధారణంగా అనంతపురం జిల్లా అంటేనే వర్షాభావ ప్రాంతం. ఈ జిల్లాలో జూన్ నుంచి మే మొదటి వరకు కురిసే సాధారణ వర్షతం 483 మిల్లిమీటర్లు. జూన్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో పడిన వర్షపాతం 747.2 మిల్లీమీటర్లు అంటే సాధారణం కంటే 54.7 శాతం అధికంగా వర్షాలు పడ్డాయి. ఈ వర్షాలు కూడా అన్ని కాలాల్లోనూ పడటం గమనార్హం. సాధారణం సీజన్ ప్రారంభమయ్యేది నైరుతి రుతుపవనాలతో జిల్లాలో అత్యధిక వర్షపాతం ఆ కాలంలోనే అంటే జూన్ నుంచి సెప్టంబర్ మధ్యనే పడుతుంది. ఏడాది సాధారణ వర్షపాతం 483లో, నైరుతి రుతుపవనాల కాలంలోనే 319.7 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం ఉంటుంది. ఈశాన్య రుతుపవనాల ప్రభావం చాలా తక్కువగానే జిల్లాపై ఉంటుంది. 2022 జూన్ నుంచి స్టెంబర్ కాలంలో 319.7 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికిగానూ 449.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. సాధారణం కంటే 40.5 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. అక్టోబర్ నుంచి డిసెంబరు వరకు ఈశాన్య రుతుపవనాల కాలంలో సాధారణ వర్షపాతం 139.3 మిల్లీమీటర్లు అయితే 198.8 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 42.7 శాతం అధికంగా పడింది. ఇక చలికాలం జూన్, ఫిబ్రవరి మాసాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదయ్యింది. ఈ రెండు మాసాల్లో 2.6 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతమయితే పడింది కేవలం 0.1 మిల్లీమీటరు. ఇక వేసవి మార్చి నుంచి మే వరకు చూస్తే సాధారణ వర్షపాతం 21.4 మిల్లీమీటర్లు అయితే పడింది 99.3 మిల్లీమీటర్లు కావడం గమనార్హం. ఇది సాధారణం కంటే 364 శాతం అధికంగా పడింది. మార్చి నెలలో సగటున 13.5 మిల్లీమీటర్లు, ఏప్రిల్‌లో 30.2 మిల్లీమీటర్లు మే నెలలో 55.6 మిల్లీమీటర్లు ఇప్పటి వరకే పడింది.

అకాల వర్షాలతో రైతులకు తీరని నష్టాలు

అకాల వర్షాలు రైతులకు నష్టాలనే మిగులుస్తున్నాయి. మార్చి నెలలో బలమైన ఈదురు గాలులతోపాటు, పెద్దఎత్తున వడగండ్ల వాన పడింది. ఈ సమయంలో ఉద్యానవన పంటలకు తీరని నష్టం చేకూర్చింది. సుమారు రూ.220 కోట్ల మేరకు పంటనష్టం వాటిల్లింది. తాజాగా ఇప్పుడు పడుతున్న వర్షాలు అదే తీరున ఉన్నాయి. వరి, మొక్కజొన్న తదితర పంటలు కలిపి సుమారు నాలుగు కోట్లకుపైగా పంటనష్టం మిగిల్చింది. ఉద్యావన పంటలకు సంబంధించి రూ.1.33 కోటి నష్టం వాటిల్లింది. ఇంకా వర్షాలు పడుతూనే ఉండటంతో రైతులు గుబులు నెలకొంది. తాజాగా సోమవారం రాత్రి కూడా పెద్దఎత్తున వర్షాలున్నట్టు వాతావరణ శాఖ చెబుతుండటం రైతుల్లో గుబులు రేపుతోంది.



బొమ్మనహాల్‌లో వర్షానికి తడిసి ముద్దయిన వడ్లు

రైతులను ముంచిన వర్షాలు.. భారీగా పంట నష్టం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఇటీవల కురిసిన వర్షాలు అన్నదాతలను నట్టేట ముంచాయి. దీంతో రైతులకు అపార పంట నష్టం వాటిల్లింది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు వరి, మొక్కజొన్న, వేరుశెనగ, పత్తి తదితర పంటలు సాగు చేశారు. అయితే ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురవడంతో భారీగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో 3.7 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ సిబ్బంది తెలిపారు. రైతులు కోత మిషన్లతో వరి పంటను కుప్ప చేసి ఆరబెట్టుకున్న సమయంలో వర్షాలు కురవడంతో వడ్లు తడిసి ముద్దయి మొలకలు వచ్చాయి. వారం రోజుల నుంచి వరి ధాన్యాన్ని ఆరబెట్టిని సంచుల కొరత కారణంగా వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడం, ప్రభుత్వం సహకరించకపోవడంతో పూర్తి పంట నష్టపోయామని కష్టాలే మిగిలాయని రైతులు వాపోతున్నారు. మొలకెత్తిన పంటను ప్రస్తుతం ఉన్న ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇక పత్తి పైరులో నీరు నిలిచి వేరు కుళ్లిపోవడంతో రైతులు ఎకరాకు రూ. 50 వేల నష్టపోయారు. ఓ వైపు వర్షాలు, మరో వైపు రసాయన ఎరువులు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రిమిసంహారక మందుల కోసం పక్క రాష్ట్రమైన కర్నాటకలోని బళ్లారికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్‌బీకేల్లో ఎరువులు, మందుల కొరత తీవ్రంగా ఉందని, దీనికితోడు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలు ఎవరికి మొర పెట్టుకోవాలో తెలియడం లేదంటున్నారు. ముఖ్యంగా భూసార పరీక్షల విషయంలో దిక్కుతోచక అవగాహన రాహిత్యంతో ఏదో ఒక పంట సాగు చేసి నష్టపోతున్నారు. కొల్లగానహళ్లి, బండూరు, బల్లనగుడ్డం, కురవల్లి సచివాలయాల్లో సిబ్బంది కొరత వల్ల రైతులు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులను బళ్లారిలో దుకాణదారుల సలహా మేరకే కొనుగోలు చేసి పంటలకు వినియోగిస్తున్నారు. స్థానికంగా ఎరువులు కొనుగోలు చేసి పంటకు పిచికారి చేయగా అవి వారమైనా కరగలేదని అలాంటి దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రాబోయే రోజుల్లో వర్షాల సమాచారం ముందుగానే ఇచ్చి రైతులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే చేతికొచ్చిన పంట నోటికి అందకుండా పోయి రైతులకు నష్టాలు తప్పవు.

'జగనన్నకు చెబుదాం'ను విజయవంతం చేద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకునే విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎమ్.గౌతమి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, సహాయ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, డిఆర్‌ఒ గాయత్రిదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, అన్సెట్ సిఇఒ కేశవ నాయుడు, ఆర్డీవో మధుసూదన్‌తో కలిసి జిల్లా నలమూలల నుంచి వచ్చిన ప్రజలతో అర్జీలను స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె అధికారులతో మాట్లాడారు. మంగళవారం ఉదయం వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్నకు చెబుతాం అనే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. జిల్లా కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. మండల, మున్సిపల్ కేంద్రాల్లో ఈ వర్చువల్ లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని వీక్షించే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్పందన కార్యక్రమంలో స్వీకరించే అర్జీలు నాణ్యతగా పరిష్కరించాలన్నారు. కోర్టు, వివిధ కమిషన్లకు సంబంధించిన కేసులలో సకాలంలో కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. జిల్లా కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. భర్తీ చేయాల్సిన పోస్టులకు ఇంకా నోటిఫికేషన్ కాకపోతే మరోసారి నోటిఫికేషన్ పంపాలన్నారు. స్పందన కార్యక్రమం ముగిసిన అనంతరం 2023-24 సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 23 నుంచి మార్చి 2024 వరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని పేర్కొంటూ ముద్రించిన జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

'ఉపాధి హామీ' పై అవగాహన కల్పించండి

ఉద్యాన పంటల రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించే కార్యక్రమంపై అర్హులైన ప్రతి రైతుకూ అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎమ్.గౌతమి సోమవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. జిల్లాలోని సన్నకారు రైతులకు మూడేళ్ల కాలానికి లక్ష నుంచి లక్షన్నర రూపాయల వరకూ లబ్ధి చేకూర్చే కార్యక్రమంపై సరైన అవగాహన కల్పిస్తే జిల్లాలో ఉద్యాన పంటల అభివద్ధికి మరింత తోడ్పాటు అందించినట్టవుతుందన్నారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో చేపడుతున్న అమత్ సరోవర్ ప్రాజెక్టు పథకం కింద జిల్లాలోని మొత్తం 75 చెరువుల అభివద్ధి, ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోజుకు లక్ష మందికి ఉపాధి కల్పించాలని డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డిని ఆదేశించారు.



కలెక్టర్ ఎం.గౌతమికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

డిగ్రీ కళాశాలల హాస్టళ్లను కొనసాగించాలి

కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కరువు జిల్లాలో ఎస్కెయు డిగ్రీ కళాశాలకు అనుబంధంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లను కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ ఎమ్.గౌతమిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ వందలాది మంది విద్యార్థులు సంక్షేమ హాస్టళ్లో మీద ఆధాపడి చదువును కొనసాగిస్తున్నారని తెలిపారు. ఎస్.కె.యూ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు సంక్షేమ హాస్టళ్లలో ఉండి విద్యనభ్యసిస్తు న్నారని తెలిపారు. జిల్లాతో పాటు పక్కనే ఉన్నటువంటి శ్రీసత్యసాయి, కర్నూల్, కడప జిల్లాల విద్యార్థులు కూడా అనంతపు రం ఎస్కెయు పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుకుంటున్నారని తెలిపారు. ఎస్కెయు డిగ్రీ కళాశాలల్లో 1, 3, 5వ సెమిస్టర్లు పూర్తయ్యాయన్నారు. సెమిస్టర్లు పూర్తయిన అనంతరం 2,4,6 సెమిస్టర్ల కోసం యూనివర్సిటీ అనుబంధం డిగ్రీ కళాశాలలు, అటానమస్ కళాశాలల్లో పాఠాలు చెప్పడం ప్రారంభించిన తర్వాత బీసీ, ఎస్టీ, ఎస్సీ వెనకబడిన సంక్షేమ హాస్టల్స్‌లో ఉండి చదువుతున్న విద్యార్థులు కూడా హాస్టల్ నుంచి బయటికి వెళ్లాలని హాస్టల్ అధికారులు సర్క్యులర్ జారీ చేశారని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులను పస్తులు పెట్టేందుకు ప్రయత్నిస్తుందనడానికి ఇదే నిదర్శనం అన్నారు. ఒక వైపు కళాశాల నడుపుతామని యూనివర్సిటీ విసి, ప్రిన్సిపల్ చెబుతున్నారని తెలిపారు. మరొక వైపు స్థానిక వార్డెన్‌లు, సంక్షేమ హాస్టల్ అధికారి డీడీలు విద్యార్థులకు సర్క్యులర్లు జారీ చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులను చదువుకు దూరం చేసే ప్రయత్నం చేస్తోందని, ఇలాంటి ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. ఎస్కేయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల అనుబంధ సంక్షేమ హాస్టల్స్‌ను కొనసాగించి విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడాలని కోరారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రజిత, విజయ్, చంద్ర, ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకూ రెడ్‌క్రాస్ సేవలు

కలెక్టర్ ఎమ్.గౌతమి



రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ కాపు భారతికి జ్ఞాపికను అందిస్తున్న కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రెడ్‌క్రాస్ సేవలు మారుమూల ప్రాంతాలకు సైతం విస్తరించాలని కలెక్టర్ ఎమ్.గౌతమి పేర్కొన్నారు. సోమవారం ఉదయం స్థానిక పాతూరు, శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న జిల్లా రెడ్‌క్రాస్ సెంటర్లో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జీన్‌హెన్రీ డ్యూనంట్ చిత్రపటానికి రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ కాపు భారతితో కలిసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్‌హెన్రీ డ్యూనంట్ జయంతి రోజున ఆయన గౌరవార్థం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచంలో ఏ విపత్తులు సంభవించినా రెడ్‌క్రాస్ సంస్థలు ముందుగా స్పందించి సేవా కార్యక్రమాలను చేస్తున్నాయన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణప్రసాద్ తనవంతు సహాయంగా నాలుగు లక్షల రూపాయలను సొసైటీకి విరాళంగా ఇచ్చారు. జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ కాపు భారతి మాట్లాడుతూ, దాతలు, అధికారుల సహకారంతో బ్లడ్ బ్యాంక్‌తో పాటు, ఫస్ట్‌ఎయిడ్, అవేర్నెస్, ప్లాంటేషన్ వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోందని. అందరి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలంబన జనార్ధన, మహాలక్ష్మి క్లాత్ హితెన్ కుమార్ జైన్, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ జనార్దన్ రెడ్డి, సుబ్రమణ్యం, సుధీర్, రెడ్‌క్రాస్ సిబ్బంది, వాలెంటీర్లు పాల్గొన్నారు.

ఈఏపీసెట్‌కు 3,37,422 దరఖాస్తులు

- ◆ 9న హాల్‌టికెట్లు డౌన్లోడ్ చేసుకునే అవకాశం
- ◆ 15 నుంచి 19 వరకు ఇంజినీరింగ్ పరీక్షలు
- ◆ 22 నుంచి 23 వరకు అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు
- ◆ ఈఏపీ సెట్ కన్వీనర్ ఆచార్య శోభాబిందు



ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఎపి.ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈఏపీసెట్ - 23కు సోమవారం నాటికి 3,37,422 దరఖాస్తులు అందాయని ఈఏపీసెట్ కన్వనర్ ఆచార్య శోభాబిందు, ఛైర్మన్ ఆచార్య రంగజనార్ధన తెలిపారు. సోమవారం వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ ఏపీ ఈఏపీసెట్-2023 ప్రవేశ పరీక్షకు సోమవారం నాటికి ఇంజినీరింగ్ విభాగానికి 2,37,055 లక్షలు, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 99,388, రెండు విభాగాల్లో పరీక్ష రాయడానికి 979 దరఖాస్తులు అందాయన్నారు. ఇంతకుమునుపు ప్రకటించినట్లుగానే ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు ఈనెల 22 నుంచి 23వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. 19వ తేదీ మినహా మిగతా అన్ని తేదీల్లో ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, తిరిగి 3.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఇంజినీరింగ్ చివరి రోజు 19వ తేదీన కేవలం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మాత్రమే పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈఏపీసెట్‌కు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ ఈ నెల 9వ తేదీన ఉదయం 10.00 గంటల నుంచి APEAPCET-2023 వెబ్ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. హాల్‌టికెట్‌లోని వివరాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. వివరాల్లో ఏవైనా తేడాలున్నట్లయితే అభ్యర్థులు 08554-23411, 232248 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈమెయిల్ ద్వారా helpdeskapeapcet-2023@gmail.comకు మెయిల్ పంపి సరిదిద్దుకోవచ్చునని తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం బస్టాండ్ నుంచి పరీక్ష కేంద్రానికి చేరే మార్గాన్ని హాల్‌టికెట్ వెనక ముద్రించామని చెప్పారు. ఉదయం సెషన్లో అభ్యర్థులను 7.30 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారని తెలిపారు.

బిజెపి ఎంపీ శరణ్‌సింగ్‌ను బర్తరఫ్ చేయాలి

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడాకారుల నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్‌శరణ్‌సింగ్‌ను తక్షణమే ఎంపి పదవి నుంచి భర్తరఫ్ చేసి శిక్షించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద రెజ్లర్లు చేస్తున్న ఆందోళనలకు మద్దతుగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల మైదానంలో క్రీడాకారుల తో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా విస్తరించేలా రెజ్లర్ మహిళా క్రీడాకారిణులు బంగారు, కాంస్య పథకాలు సాధిస్తేంటే అండగా నిలవాల్సిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడటం బాధాకరమన్నారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని స్థితిలో క్రీడాకారిణులు మనసికంగా కుంగిపో యారన్నారు. చివరకు పోరాట మార్గం ఎన్నుకుని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపడుతుంటే బిజెపి ప్రభుత్వ పట్టనట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ఏడుగురు రెజ్లర్ క్రీడాకారినులు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తక్షణమే చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించిందన్నారు. అయినా బిజెపి ఎంపీపై చర్యలు తీసుకోకుండా బాదిత క్రీడాకారిణులు, కుటుంబ సభ్యులపై దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడటం, ఆర్థికంగా సహకరిస్తామని ఆశపెట్టడం బాధాకరనమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎంపీని సస్పెండ్ చేసి అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, శివ, వలి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పట్టవా..

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా అనేక సమస్యలతో సతమతమవుతున్న మున్సిపల్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎటిఎం.నాగరాజు అధ్యక్షతన సంఘమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండుటెండను సైతం లెక్క చేయకుండా రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు కండలు అరిగేలా పని చేస్తూ.. గుండెలు పగిలేలా సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం రాకపోవడం బాధాకరమన్నారు. దీంతో కార్మికుల బతుకులు రోజురోజుకూ దినదినగండంగా మారుతున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్, ఎన్ఎంఆర్, మలేరియా, కోవిడ్, గార్బేజ్, క్లాప్ డ్రైవర్స్, స్కూల్ స్వీపర్స్ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ కార్మికులకు సిపిఎస్ రద్దు చేయడంతోపాటు జిపిఎఫ్ అకౌంట్లు తెరవాలన్నారు. అలాగే హెల్త్ కార్డులు, రక్షణ పరికరాలు, పనిముట్లు సకాలంలో ఇవ్వాలని, 2 సంవత్సరాల బకాయి సరెండర్ లీవ్ అమౌంటు, ఇంక్రిమెంట్లు వెంటనే ఇవ్వాలన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, కరువు భత్యం, మధ్యంతర భతి ఇవ్వాలన్నారు. కార్మికులందరిని రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. అలాగే నగర విస్తీర్ణం పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలని, ఇఎస్ఐ, ఈపీఎఫ్, లలో ఉన్న తప్పులను సవరించి కార్మికులకు సరైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన అవుట్ సోర్సింగ్ కార్మికులు, 60 సంవత్సరాల పేరుతో తొలగించిన కార్మికులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కార్మికులు కుటుంబ సభ్యులలో ఒకరికి ఉపాధి కల్పించాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలన్నారు. వీటితో పాటు మిగిలిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర 1, 2 కమిటీల ప్రధాన కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజ, అధ్యక్షులు గురురాజా, మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగభూషణం, జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, సహాయ కార్యదర్శి ఎం.లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, కమిటీ సభ్యులు మంత్రి వరలక్ష్మి, మల్లేష్, వెంకటేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



సిఐటియు ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ చేపట్టిన దృశ్యం



రాజీవ్‌కాలనీ సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఇంటిగుత్తలకు కోర్టునోటీసులా.. : సిపిఎం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఇంటి గుత్తలు కట్టలేదని రాష్ట్ర ప్రభుత్వం కోర్టు ద్వారా పేద ప్రజలను భయాందోళన గురి చేసేలా నోటీసులు జారీ చేయడం అన్యాయంగా ఉందని, ఇలాంటి చర్యలు మానుకోవాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఇంటిగుత్తలు కట్టాలంటూ కోర్టు నోటీసులు జారీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రాజీవ్ కాలనీ సచివాలయం వద్ద ధర్నా కాలనీ వాసులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నగర 1వ కమిటి కార్యదర్శి రామిరెడ్డి, ఉప సర్పంచి మసూద్ నాయకులు హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. ఇంటి పన్నులు చెల్లించలేదని పంచాయతీ పరిధిలో 456 మందికి కోర్టు ద్వారా నోటీసులు ఇవ్వడం అన్యాయంగా ఉందన్నారు. వీరందరూ రూ.225 నుంచి రూ. 500 లోపు ఇంటి గుత్తలు కట్టాల్సి ఉందని, వీరికి కూడా దుర్మార్గంగా ప్రభుత్వం నోటీసులు సరికాదన్నారు. పేదలపై ఇలాంటి చర్యలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ కాలనీ ఎంపీటీసీ సభ్యురాలు రమీజాబీ, సిపిఎం నగర నాయకులు వలీ, వెంకటేష్, ఆటో వెంకటేష్, కిష్ట, అనిల్, ఇస్మాయిల్, దస్తగిరి, వహీదా, నాగలక్ష్మి, కష్ణ, లాలు, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులకు ఇక్కట్లు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సి.రమేష్

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేనివిధంగా యూనివర్సిటీల్లో సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహించడం వల్ల విద్యా సంవత్సరం గడువు ఎక్కడ నుంచి ఎక్కడ వరకూ ఉందో అర్థం కావడం లేదన్నారు. తరగతులు నిర్వహించాలని నిర్ణయించుకున్నా అదేస్థాయిలో విద్యార్థులకు వసతి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. వసతి కల్పించకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వసతి గృహాలను తెరిపించి విద్యార్థులకు వసతి ఏర్పాట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఉచిత ఆర్‌టిసి రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన ఆర్డీవో రవీంద్ర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామనిహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి వెంకీ, గుత్తి మండల కార్యదర్శి గౌతమ్‌నాయక్, కృష్ణ, చిరంజీవి, చందు, సర్దార్, మహబూబ్‌బాషా, రాజేష్‌నాయక్, సుధాకర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి-నార్పల

ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులను వెంటనే ఆదుకోవాలని టిడిపి నాయకులు ఆలం వెంకటనరసానాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండలంలోని దుగుమర్రి వర్షాలకు దెబ్బతిన్న పంటలను టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మార్చిలో భారీ వడగండ్లు పడి మండలంలో రైతులు సాగు చేసిన అరటి, బొప్పాయి, మొక్కజొన్న తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అయినా ఇంత వరకూ అధికారులు అంచనా కూడా వేయలేదన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను నట్టేట ముంచిందన్నారు. ఇప్పటికైనా స పందించి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను నట్టేట ముంచిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి పిట్టు రంగారెడ్డి, మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి పిఎల్ లక్ష్మీనారాయణ, జిల్లా రైతు సాధికారిక కమిటీ రాజగోపాల్, పోల్ మేనేజ్‌మెంట్ నాగభూషణ, సోషల్ మీడియా దాసరి రాము, యూనిట్ ఇన్‌ఛార్జి శివారెడ్డి జైసింహా, నాగేంద్ర, బూత్ ఇన్‌ఛార్జి హనుమంతురెడ్డి, సాకే జయరాం, గ్రామ కమిటీ అధ్యక్షులు భక్తవత్సల, నల్లప్ప, రామాంజనేయులు, సోమశేఖర్, దేవేంద్ర, ఆనంద్, శేఖర్, చక్రవర్తి, హరీష్, మహేష్, తలారి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లులో పోలీసుల తనిఖీలు

గుంతకల్లు : సరిహద్దు రాష్ట్రం కర్ణాటకలో మరో రెండు రోజుల్లో శాసనసభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డీఎస్పీ నరసింగప్ప ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని హనుమాన్ జంక్షన్‌లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆంధ్రా సరిహద్దు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం, డబ్బులు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, టూటౌన్ సీఐ గణేష్, రూరల్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, సెబ్ సీఐ మహేష్, ఎస్ఐలు సురేష్, గోపాలుడు, స్పెషల్ పార్టీ సిబ్బంది, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

'నాస్థలం నాకు ఇప్పించాలి'..

పిల్లలతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట తల్లి ఆందోళన

ప్రజాశక్తి-నార్పల

రూ.50లక్షలు విలువజేసే స్థలాన్ని నా సంతకం లేకుండా రిజిస్టర్ చేయించుకున్నారని, వెంటనే నా స్థలాన్ని నాకు ఇప్పించాలని పిల్లలతో కలిసి ఓ తల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన వడ్డే హేమావతి భర్తను విడిచిపెట్టి ఒంటరిగా జీవిస్తోంది. ఈనేపథ్యంలో నార్పలకు చెందిన నిజామ్ అనే యువకుడితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఈనేపథ్యంలో హేమావతి పేరుతో ఉన్న ఐదు సెంట్ల స్థలాన్ని నా పేరుతో రాస్తే పెళ్లి చేసుకుంటానని నిజామ్ నమ్మబలికాడు. దీంతో గత నెలలో శింగనమల మసీదులో ముస్లిం సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నారు. అదేరోజు హేమావతి తన పేరుమీద ఉన్న ఐదు సెంట్ల స్థలాన్ని ఆమె సంతకం లేకుండా నిజామ్ రిజిస్టర్ చేయించుకున్నాడు. మూడురోజుల తర్వాత తనకు వద్దని ఇంటి నుంచి బయటకు పంపాడు. ఈనేపథ్యంలో వైసిపి నాయకుడు మొరుసు రమణరెడ్డికి సంబంధిత స్థలాన్ని నిజార్ విక్రయించాడు. విషయం తెలుసుకున్న బాధితురాలు హేమావతి నిజామ్‌ను, రమణను నిలదీసింది. దీంతో రూ.లక్షలు పోసి కొన్నానని, బుకాయించారు. చేసేది లేక తన కూతురు, కొడుకుతో కలిసి సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన స్థలాన్ని తనకు ఇవ్వాలని అడిగితే వైసిపి నాయకులు చంపుతామని బెదిరిస్తున్నాడని వాపోయింది. ఆ స్థలమే తనకు ఆధారమని ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని కన్నీరుమున్నీరుగా విలపించింది. తనకు న్యాయం చేయకపోతే పిల్లలతో సహా పోలీస్‌స్టేషన్ ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించింది. ఇందుకు స్పందించిన పోలీసులు వివాదంపై విచారించి న్యాయం చేస్తామని తెలిపారు.

ఉచిత కబడ్డీ శిక్షణను సద్వినియోగం చేసుకోండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-తాడిపత్రి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కబడ్డీ శిక్షణ శిబిరాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వరుణ్ పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని విశ్రాంత వ్యాయమ ఉపాధ్యాయులు శివయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కబడ్డీ క్రీడ ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. అయితే సరైన శిక్షణ లేక ఎంతోమంది విద్యార్థులు క్రీడాకారులుగా తయారుకావడం లేదన్నారు. విద్యార్థులను ఉన్నత క్రీడాకారులుగా తయారు చేయడానికే శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విశ్రాంతి వ్యాయామ ఉపాధ్యాయులు శివయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో ఆటలకు మంచి గుర్తింపు ఉందన్నారు. అంతేగాకుండా ఆటల్లో ప్రావీణ్యత సాధిస్తే ఉద్యోగావకాశాలు కూడా మెండుగా ఉంటాయన్నారు. ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘానికి, సహకరించిన సాయి చైతన్య పాఠశాల యాజమాన్యానికి ప్రత్యేకమైన క్రీడాభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి చైతన్య స్కూల్ కోచ్ నరసింహా, వ్యాయామ ఉపాధ్యాయులు దాదా ఖలందర్, ఇర్షాద్, పులయ్య, తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

గడువులోగా సమస్యలకు పరిష్కారం చూపాలి : ఎస్పీ

అనంతపురం క్రైం : స్పందనలో వచ్చే సమస్యలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈమేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 123 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరితో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. అంతేగాకుండా సంబంధిత పోలీసు అధికారులతో పిటీషనర్లను జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడించారు. చట్ట పరిధిలోని సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : మేయర్


జిమ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్ : వర్షాలు పడుతున్న నేపథ్యంలో పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేపట్టాని మేయర్ మొహమ్మద్‌వసీం సూచించారు. సోమవారం నగరంలోని 48వ డివిజన్ పరిధిలో ఉన్న ఆర్‌కె నగర్‌లో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు అక్కడి పార్కులోని సమస్యలు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. వర్షం నీరు రోడ్లపైకి రాకుండా చూడాలని సూచించారు. ఇందుకు మేయర్ స్పందిస్తూ పార్కులో పాడైపోయిన ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. పూర్తిగా పనిచేయని ఓపెన్ జిమ్ పరికరాలను తొలగించి కొత్త వాటిని అమర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాసులు, డిఇ రాంప్రసాద్‌రెడ్డి, ఎఇ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం సర్వజన ప్రాంతీయ ఆసుపత్రి వైద్య సిబ్బంది, కార్మికుల పట్ల నియంతలా వ్యవహరిస్తున్న ఆఫీస్ సూపరింటెండెంట్ రామ్‌ప్రసాద్‌రావుపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆస్పత్రి వైద్యాధికారిణి మాధవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మల్లికార్జున, నాగరాజు మాట్లాడు తూ ఆఫీస్ సూపరింటెండెంట్ ఆస్పత్రిని సొంతింటిలా మార్చుకొని పనికిమాలిన పనులకు పాల్పడు తున్నాడని ఆరోపించారు. మహిళా వైద్యులు, కార్మికుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ తనకు సేవలు చేయాలని, లేకపోతే విధుల నుంచి తొలగిస్తానని, మరోచోటికి బదిలీ చేయిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. గతంలో నర్సులతో గొడవ పడడంతో పాటు బ్లడ్ బ్యాంకులో పని చేసే వ్యక్తి పట్ల దురుసుగా వ్యవహరించాడని ధ్వజమెత్తారు. ఈయన వైఖరిపై పోలీసులకు ఫిర్యాదులు వెళ్లాయన్నారు. జిల్లా వైద్యాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టి ఆయనపై చర్యలు తీసుకోవాలని, లేనిచో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన వైద్యాధికారిణి ఈ విషయాలను ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్తానని తెలిపారు.


ఆస్పత్రి వైద్యాధికారిణి మాధవికి వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

అభివృద్ధి మాది..అవినీతి మీది..

ఎమ్మెల్యే కాపు పనితీరుపై కాలవ ఆగ్రహం

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి వల్ల నాలుగేళ్లలో రాయదుర్గం నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా టిడిపి హయాంలో నిర్మించిన రాయదుర్గం-గుమ్మఘట్ట రోడ్డుపై తీసిన నాల్గో వీడియోను సోమవారం ఆయన విడుదల చేశారు. రాష్ట్రంలోనే రాయదుర్గం వెనుకబడ్డ ప్రాంతమైతే నియోజకవర్గంలో మారుమూల ఉన్న గుమ్మఘట్టకు గతంలో తాము రూ.21 కోట్లతో అద్భుతమైన రహదారిని నిర్మించా మన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించామన్నారు. ఇరువైపులా పచ్చని చెట్లతో ఆహ్లాదకరంతో పాటు సుఖవంతమైన ప్రయాణభాగ్యాన్ని గుమ్మఘట్ట ప్రజానీకానికి చంద్రబాబు ప్రభుత్వం అందించిందన్నారు. గుమ్మఘట్ట మండల కేంద్రంలో విద్యాభ్యాసం చేశానని ఊదరగొడుతున్న కాపు రామచంద్రారెడ్డి నియోజకవర్గ ప్రజలకు ఒక్క శాశ్వత అభివద్ధి పని కూడా చేయలేదని విమర్శించారు. కాపు అసమర్థ, చేతకానితనం వల్లే రాయదుర్గంలో అభివద్ధి నిలిచిపోయిందన్నారు. అక్రమార్జన, అవినీతి సంపాదనే ధ్యేయం కాకుండా రాయదుర్గం అభివద్ధికి కషి చేయాలని హితవు పలికారు.


గుమ్మఘట్ట రోడ్డుపై సెల్ఫీ ఛాలెంజ్ విసురుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు

రేపు పాలిసెట్ పరీక్ష

తాడిపత్రి రూరల్ : పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశానికి బుధవారం పాలిసెట్-2023 పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నికల్ ప్రిన్సిపల్ శైలేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిపత్రి మండలవ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో నిర్వహించనున్న పాలిసెట్ పరీక్షకు 1702 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్ష ఉంటుందన్నారు.

గన్నెవారిపల్లిలో ఎవరూ టిడిపిలో చేరలేదు : వైసిపి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లిలో ఎవరూ టిడిపిలో చేరలేదని, జెసి ప్రభాకర్‌రెడ్డి కేవలం తప్పుడు ప్రకటనలు చేశారని వైసిపి సీనియర్ నాయకులు కురుబ రామశేఖర్ తెలిపారు. సోమవారం గన్నెవారిపల్లి కాలనీలో ఉన్న వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గన్నెవారిపల్లి పంచాయతీలో కాలనీవాసులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వైస్ సర్పంచి వెంకటరమణ అభివృద్ధికి అడ్డుపడుతున్నాడని జెసి ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదన్నారు. ఇన్ని రోజులు సర్పంచిగా పని చేసిన మీ వ్యక్తి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడుతుండటంతో లేనిపోని వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రమణమ్మ, వైసిపి నాయకులు గురు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్పంచి ధనలక్ష్మిది ప్రభుత్వ హత్యే..



శింగనమల : ఒంగోలు జిల్లా దర్శి మండలం రామచంద్రపురం పంచాయతీ సర్పంచి బాదం ధనలక్ష్మిది ఆత్మహత్య కాదని, ప్రభుత్వం చేసిన హత్యే అని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ సభ్యులు డేగల కృష్ణమూర్తి, గుమ్మేపల్లి సర్పంచి లలితమ్మ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక, చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్ల తట్టుకోలేక ధనలక్ష్మి ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణితోనే సర్పంచులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఆత్మహత్య చేసుకున్న ధనలక్ష్మి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలోని 12,918 మంది సర్పంచుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వం దొంగలించిన ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లను తక్షణమే పంచాయతీల అకౌంట్లలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే ధనలక్ష్మి వంటి ఆత్మహత్యలు కొనసాగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవంగా వెంకటరమణస్వామి కల్యాణోత్సవం

రాయదుర్గం : పట్టణంలో సోమవారం ప్రసన్న వెంకటరమణస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి నేసేపేటలోని భక్త మార్కండేయస్వామి ఆలయం వరకు మేళతాళాలతో వెళ్లి వధువు పద్మావతి(వైశాలి)ని తీసుకొచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామివారి ఉత్సవమూర్తికి వధువు పద్మావతికి పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించా రు. సాధారణంగా స్వామివారి కల్యాణోత్సంలో అర్చకులు వధువు మెడలో మంగళసూత్రం కడతారు. కానీ వధువు స్థానంలో ఉన్న పద్మావతి(వైశాలి) మెడలో ఆమె తల్లి స్వప్న మంగళసూత్రం కట్టారు. కల్యాణోత్సవాన్ని టెలివిజన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి, ఏపీఐఐసీ అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి, పురపాలక సంఘం అధ్యక్షుడు పొరాలు శిల్ప, ఆలయ పాలక మండలి అధ్యక్షుడు గౌని పాలాక్షి రెడ్డి, దేవాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి నరసింహారెడ్డి, పాలక మండలి సభ్యులు లక్ష్మి, సత్యనారాయణ, ఉమాపతి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఉపేంద్ర రెడ్డి, పుర ప్రముఖులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కల్యాణోత్సం అనంతరం భక్తులకు లడ్డూ ప్రసాదం అందజేసి, అన్నదానం చేశారు.

బెళుగుప్ప ఎపిఎంగా ఆంజనేయులు

బెళుగుప్ప : మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో ఎపిఎం ఆంజనేయులు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ విడపనకల్లు మండలం నుంచి బదిలీపై ఆయన బెళుగుప్పకు వచ్చినట్లు తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మహిళా సంఘాల సభ్యులకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు.



సంక్షేమ హాస్టళ్లను కొనసాగించాలి

కళ్యాణదుర్గం : శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీకి అనుబంధంగా ఉన్న డిగ్రీ కళాశాలల హాస్టళ్లను కొనసాగించాలని విద్యార్థి ఫెడరేషన్ సంఘం(ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్డీఓ నిశాంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయదు ర్గం, కళ్యాణదుర్గం పట్టణాల్లో ఉన్న కళాశాలలకు వివిధ ప్రాంతాల నుంచి పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు వస్తున్నారన్నారు. వారికి హాస్టల్ వసతి లేకపోవడంతో విద్యనభ్యసించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కావున అధికారులు స్పందించి హాస్టల్‌ను కొనసాగించాలని లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బంగిశివ, వంశీ, అరవింద్, దనుష్, ఆదర్శ, హర్ష, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


మృతిచెందిన వ్యక్తి

బెలుగుప్ప : మండల పరిధిలోని కాలువపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరో నలుగురు గాయపడ్డారు. ఎస్ఐ రామకృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి మండల పరిధిలోని కాలువపల్లి సమీపంలో నిలిపి ఉన్న బొలేరో వాహనాన్ని వేగంగా వచ్చిన ఐచర్ వాహనం వేగంగా ఢీకొంది. దీంతో నాగభూషణం (45) అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రామకృష్ణయ్య ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఐదుగురిని 108 సాయంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో వేపులపర్తి గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ (40) చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుకు ఆవు, ఎద్దు మృతి

నార్పల : మండల పరిధిలోని వెంకటాంపల్లి గ్రామానికి చెందిన రైతు కొర్రకూటి శ్రీనివాసులుకు చెందిన ఆవు, ఎద్దు సోమవారం పిడుగుపాటుకు మృతిచెందాయి. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో భారీ మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో పిడుగుపాటు గురై ఆవు, ఎద్దు మృతిచెందినట్లు తెలిపారు. ఈమేరకు పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు మండల పశువైద్యులు గోవిందరాజులు తెలిపారు.


మృతిచెందిన ఆవు, ఎద్దు

గరుడ వాహనంపై విహరించిన నారసింహుడు


గరుడ వాహనంపై విహరిస్తున్న నారసింహుడు

ఉరవకొండ : బ్రహోత్సవాల్లో భాగంగా పెన్నఅహోబిలం లక్ష్మీనరసింహస్వామి సోమవారం రాత్రి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా అశేష భక్త జన సందోహం నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులతో పెన్నోబిలం భక్తులతో కిక్కిరిసింది. ఈ కార్యక్రమంలో ఇఒ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారాకనాథ్‌స్వామి, బాలాజీస్వామి, గుండురావు, ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు.

ఉరవకొండ : మండలంలో ప్రసిద్ధిగాంచిన పెన్నోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పెద్దకౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పివి.అనికేత్, ఎంపిడిఒ చంద్రమౌళి, ఆలయ ఇఒ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏరఆపటు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ చౌడప్ప, ఆరోగ్య సహాయకులు నాగరాజు, వరలక్ష్మి, చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన

ఆత్మకూరు : మండల కేంద్రంలోని సచివాలయం-1లో లింగ వివక్ష, నిర్ధారణ చట్టంపై అవగాహన సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1996లో లింగ నిర్ధారణ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ప్రకారం ఎవరైనా స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేసి అబార్షన్లకు పాల్పడితే మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దయాకర్, సర్పంచి వరలక్ష్మి, సిహెచ్ఒ చంద్రావతి, ఎంపిహెచ్ ఇఒ నాగేశ్వరయ్య, పిహెచ్ ఎన్.తులసమ్మ, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎమ్మెల్యే పద్మావతి పర్యటన

పుట్లూరు : ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మంగళవారం, బుధ వారం మండలంలో పర్యటించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు అరకటవేముల, బుధవారం ఎ.కొండాపురం గ్రామ పంచాయతీలో నిర్వహించనున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

జెండాలు నాటిన సిపిఎం నాయకులు

గార్లదిన్నె : మండల కేంద్రంలో అధికార పార్టీ నాయకులు ఆక్రమించిన సర్వేనెంబర్ 456లోని ప్రభుత్వ భూమిలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు సోమవారం జెండాలు నాటారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ సంబంధిత స్థలాన్ని స్వాధీనం చేసుకుని పేదలకు పట్టాలివ్వాలని ఇప్పటికే సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్‌తోపాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అయినా స్పందన లేదన్నారు. దీంతో ప్రభుత్వ స్థలాన్ని తాము ఆక్రమించుకుని జెండాలు నాటామన్నారు. రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే పేదలతో కలిసి గుడిసెలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, మిద్ది నల్లప్ప, నాగమ్మ, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఇంటి స్థలాలు లేని నిరుపేదలు పాల్గొన్నారు.

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి : పెద్దవడుగూరు, గుత్తి మండలాల సంబంధించి 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ నారాయణ తెలిపారు. సోమవారం గుత్తి ఆర్ఎస్‌లోని సుందరయ్య కాలనీలో ఉన్న ఆర్డీటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టేట్ సిలబస్‌లో 600కు 500పైగా మార్కులు, సీబీఎస్ సిలబస్‌లో 500కు 420పైగా మార్కులు వచ్చిన విద్యార్థులు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో చదివినవారు, ఓసి, బిసి కమ్యూనిటీకి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువిన విద్యార్థులు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 11వ తేదీలోపు అర్హత పత్రాలతో తమ కార్యాలయానికి రావాలన్నారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మహిళలు, పిల్లలకు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటారామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో కుస్తీ పడుతున్న తరుణంలో వారికి ఇలాంటి సృజనాత్మకత పెంపుదలకు దోహదపడే కార్యక్రమాలు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ఈ జిల్లా గ్రంథాల సంస్థ ఛైర్మన్ ఎల్ఎమ్.ఉమా మోహన్ రెడ్డి మాట్లాడుతూ సమ్మర్ క్యాంపు ప్రతి మండలంలోని శాఖ గ్రంథాలయాలలో 8వ తేది నుంచి సమ్మర్ క్యాంపు ప్రారంభించినట్లు తెలిపారు. పిల్లలకు డ్రాయింగ్ ఆటలు, పుస్తక పఠనం, పుస్తకం సమీక్షలు, కథలు చెప్పడం, మొదలగు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారిని వి.సుబ్బరత్నమ్మ, రిసోర్స్ పర్సన్స్ సూర్య నారాయణ రెడ్డి, యోగ గురు వెంకటేశప్ప, కవి మధురశ్రీ, ఆదర్శ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అజయ్, మధు, స్పోకెన్ ఇంగ్లీష్ జూటూరు రమేష్, మిద్దె మురళి